అధ్యక్షా.. ఎంతలో ఎంత మార్పు

అక్బరుద్దీన్‌కు అభినందనలు తెలుపుతున్న సిఎం రేవంత్

అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్

- ప్రమాణం చేయించిన గవర్నర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంఐఎం పార్టీకి చెందిన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసి ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం ఉదయం 8.30 గంటలకు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సాధారణంగా సీనియర్ సభ్యులకు ప్రొటెం స్పీకర్ బాధ్యతలు అప్పగించడం ఆన వాయితీగా వస్తున్నది. ఇందులో భాగంగా ఆ బాధ్యతలు నిర్వహించాలని అక్బరుద్దీన్‌ను కోరగా అందుకు ఆయన అంగీకరించారు. ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతోపాటు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇతర పార్టీల ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

స్టార్టప్‌లకు గడ్డుకాలం

- నిధుల లభ్యతలో 72% పతనం
- ఈ ఏడాది 50 వేల కోట్లకే పరిమితం
- ఐదేళ్లలో అతి కనిష్టం..



న్యూఢిల్లీ : భారత్‌లోని స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణలో తీవ్ర సవాళ్లను చవి చూస్తున్నాయి. గతేడాదితో పోల్చితే ప్రస్తుత ఏడాదిలో నిధుల లభ్యతలో 72 శాతం పతనాన్ని చవి చూశాయని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. 2023లో ఇప్పటి వరకు 7 బిలియన్ డాలర్లు (దాదపు రూ.58 వేల కోట్లు) నిధులు అందాయని మార్కెట్ ఇంటిలిజెన్సీ వేదిక ట్రాక్సన్ జియో తన ఇంటియా టెక్ 2023 వార్షిక రిపోర్ట్‌లో వెల్లడించింది. గతేడాది మొత్తంగా 25 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2లక్షల కోట్లు) నిధులు సమీకరించగలిగాయని తెలిపింది. 2023లో అంతర్జాతీయంగా అత్యధికంగా నిధులు సమీకరించిన దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉంది.కాగా ప్రస్తుత ఏడాది నాలుగో త్రైమాసికంలో స్టార్టప్‌లు 957 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8వేల కోట్లు) నిధులను సమీకరించాయి. 2016 మూడో త్రైమాసికం తర్వాత అత్యంత కనిష్ట స్థాయికి నిధుల సమీకరణ పడిపోయిందని ట్రాక్సన్ జియో వెల్లడించింది. 2022లో 15.6 బిలియన్ డాలర్ల నిధులను అందుకున్నాయి. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు 17 ఫండింగ్ రౌండ్లలో ప్రతీ దఫాలో సగటున 100 మిలియన్ డాలర్ల చొప్పున నిధులను సమీకరించాయి. నిధుల సమీకరణలో పోన్‌పే అత్యధికంగా 750 మిలియన్ డాలర్లను అందుకుంది. కాగా స్టార్టప్‌ల నుంచి గతేడాది 19 సంస్థలు ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రాగా.. ఈ ఏడాది 18 టెక్ సంస్థలు ఇష్యూకు వచ్చాయి. ఇందులో యాత్ర, ఇక్లో లైటింగ్ లాంటి కీలక సంస్థలు ఉన్నాయి. కాగా.. బెంగళూరు, ముంబయి, ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లోని స్టార్టప్‌లు అధిక ఫండింగ్స్‌ను ఆకర్షించాయి."2023లో నిధుల లభ్యతలో మందగమనం భారత స్టార్టప్‌లకు సవాళ్లను విసురుతోంది. అయినప్పటికీ భవిష్యత్తు ఆశాజనకంగానే ఉంది. ప్రభుత్వ విధానాలకు తోడు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతో భారత్ మంచి స్థానంలో ఉందని నమ్ముతున్నాము. మా దృష్టి కొత్త ఆవిష్కరణ, విలువను సృష్టించడంపైనే ఉంటుంది. పరిశ్రమ పుంజుకుంటుంది. అభివృద్ధి చెందుతుందని మేము విశ్వసిస్తున్నాము." అని ట్రాక్సన్ జియో సహ వ్యవస్థాపకురాలు నేహ సింగ్ అన్నారు. అంతరాజతీయంగా చోటు చేసుకుంటున్న ఆర్థిక మందగమనం.. టెక్ కంపెనీలు పొదుపు చర్యలకు దిగడం తదితర అంశాలు స్టార్టప్‌ల నిధుల సమీకరణలో ప్రతికూలతలను పెంచుతున్నాయి. ఈ రంగంలో ఫండింగ్ తగ్గిపోవడంతో పాటు భారీగా ఉద్యోగాలు ఊడుతోన్న విషయం తెలిసిందే. స్టార్టప్‌లకు నిధుల మద్దతులో కేంద్ర ప్రభుత్వం సరైన విధానాన్ని అనుసరించకపోవడం, బడా కార్పొరేట్లకు కొమ్ము కాయడం వల్లే అవి ఒత్తిడిలోకి జారుకుంటున్నాయని.. కొత్తవి రాలేకపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ నుంచి కొత్త క్రెడిట్ కార్డ్

న్యూఢిల్లీ: ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్, మాస్టర్ కార్డ్‌లు సంయుక్తంగా కొత్తగా ఫస్ట్ స్వైప్ క్రెడిట్ కార్డ్‌ను ఆవిష్కరించాయి. వినూత్నమైన ఇఎంఐ ఫీచర్‌లు, చెల్లింపు సౌలభ్యం, ఉత్తేజకరమైన మర్చంట్ ఆఫర్‌లు, వేగవంతమైన రిఫరల్ బెనిఫిట్ ప్రోగ్రామ్ ఫీచర్లతో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ బిజినెస్ హెడ్ శిరీష్ భండారి తెలిపారు.

టెక్నో నుంచి స్పార్క్ గో2024 స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ టెక్నో కొత్తగా స్పార్క్ గో 2024ను విడుదల చేసింది. దీని ధరను రూ.6,699గా నిర్ణయించింది. రూ.7వేల లోపులో 3జిబి ర్యామ్, 64 జిబి మెమోరీతో దీన్ని ఆవిష్కరించామని టెక్నో మొబైల్ ఇండియా సిఇఒ అరిజీత్ తాలపత్ర పేర్కొన్నారు. 6.56 అంగుళాల డాట్ ఇన్ డిస్‌ప్లే కలిగిన స్మార్ట్‌ఫోన్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తున్నామన్నారు.

హౌసింగ్.కమ్‌లో ఎఐ ప్రైస్ ట్రెండ్ ఇంజిన్

న్యూఢిల్లీ : రియల్ ఎస్టేట్ వేదిక అయినా హౌసింగ్.కమ్ కొత్తగా ఎఐ ఆధారిత ప్రైస్ ట్రెండ్ ఇంజిన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ అత్యాధునిక ఫీచర్ వినియోగదారులకు క్లిష్టమైన ధరల డేటాను అందించడానికి దోహదం చేస్తుందని పేర్కొంది. ఆస్తులను కొనడం, విక్రయించడం, అద్దెకు తీసుకోవడం తదితర సమాచారాన్ని మరింత సులభతరం చేస్తుందని ఆ సంస్థ ప్రొడక్ట్ అండ్ డిజైన్ హెడ్ సంగీత్ అగర్వాల్ పేర్కొన్నారు.

- సరిగ్గా నాలుగు నెలల ముందున్న సీన్ రివర్స్
- ఆనాడు అధికార పక్షమైన బిఆర్‌ఎస్-నేడు ప్రతిపక్ష హోదాలో
- అప్పట్లో పట్టుమని పది స్థానాల్లేని కాంగ్రెస్-ఇప్పుడు అధికార పక్షంగా
- మంత్రి కాకుండా ఏకంగా ముఖ్యమంత్రి స్థానంలో రేవంత్
- కెసిఆర్, కెటిఆర్ లేకుండానే సభ
- అసెంబ్లీలో గులాబీ పార్టీకి పెద్ద దిక్కయిన హరీశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఒడలు బండ్లవుతాయి.. బండ్లు ఓడలవుతాయి...' రాష్ట్ర మూడో శాసనసభ తొలి సమావేశాన్ని తిలకించిన వారికెవరికైనా ఈ సామెత గుర్తుకు రాకమానదు. సరిగ్గా నాలుగు నెలల క్రితం (ఈ యేడాది ఆగస్టు మూడున) ప్రారంభమైన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో బిఆర్‌ఎస్ అధికార పక్షంగా వ్యవహరించింది. అప్పుడు ప్రతిపక్ష హోదాలో కేవలం ఐదుగురు సభ్యులతో ఉన్న కాంగ్రెస్... ఇప్పుడు 64 మందితో అధికార పక్షంలో కూర్చుంది. 'కుడి ఎడమైతే...' అనే రీతిలో శాసనసభలో ఆనాటి సీన్ రివర్సయింది. రేవంత్ సారథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత శనివారం తొలిసారిగా నిర్వహించిన శాసనసభా సమావేశంలో పదేండ్లపాటు అధికారపక్షంగా వ్యవహరించిన బిఆర్‌ఎస్ జ్ఞాపకాలతోపాటు ఇప్పటి దృశ్యాలు ఆసక్తికరంగా మారి చర్చనీయాంశమయ్యాయి.

తొలుత ఉదయం 11.10 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ... కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొదటగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణం చేశారు. మొన్నటి వరకూ బిఆర్‌ఎస్‌కు ఫ్రెండ్లీ పార్టీ అంటూ చెప్పుకున్న ఎంఐఎం నేతే... కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించటం విశేషం. అదే సభలో మజ్లిస్‌ను తమ స్నేహితుడిగా పేర్కొన్న బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ లేకుండానే అసెంబ్లీ ప్రారంభమైంది. ఆయన శస్త్ర చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో ఉండటంతో సభకు హాజరు కాలేకపోయారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సైతం తన తండ్రి ఆపరేషన్ కోసం ఆస్పత్రిలోనే ఉండాల్సి రావటంతో గైర్హాజరయ్యారు. ఇలా బిఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇద్దరూ సభకు రాలేని సమయంలో ఆ పార్టీకి పెద్ద దిక్కుగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యవహరించారు. మొన్నటిదాకా సభాపతి (స్పీకర్)గా వ్యవహరించిన సీనియర్ నేత పోచారం శ్రీనివాసరెడ్డి... ఇప్పుడు సాధారణ సభ్యుడిగా మారిపోవటం గమనార్హం.

ఇక తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో పదవులను నిర్వర్తించినప్పటికీ... ఒక్కసారి కూడా మంత్రి కాని రేవంత్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి స్థానంలో ఆసీనులవడం ఈ సభలో హైలెట్‌గా నిలిచింది. గతసభ వరకూ మాట్లాడేందుకు అవకాశం కోసం, మైకు కోసం ఎదురు చూసిన మల్లు భట్టి విక్రమార్క...ఇప్పుడు సిఎం పక్క స్థానంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో కూర్చోవటం ఆకర్షణగా నిలిచింది. గత సెషన్ వరకూ 'ఊ అంటే... ఎదురుదాడే' లక్ష్యంగా, ప్రతిపక్షాన్ని తూలనాడటానికే అసెంబ్లీకి వస్తున్నామన్నట్టు వ్యవహరించిన నలుగురైదుగురు (బిఆర్‌ఎస్) సభ్యుల స్థానాల్లో కొత్త ముఖాలు కనిపించాయి. వామపక్షాలకు ప్రతినిధిగా ఉన్న సిపిఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రజల తరపున వాణిని వినిపించేందుకు సభలో అడుగుపెట్టారు. అధికార కాంగ్రెస్ సభ్యులందరూ మూడు రంగుల కండువాలను, బిఆర్‌ఎస్ సభ్యులు గులాబీ కండువాలను, సిపిఐ సభ్యుడు ఎర్ర కండువాతో శాసనసభకు విచ్చేశారు. ఎంఐఎం సభ్యులు ఎలాంటి కండువాల్లేకుండానే తమకే ప్రత్యేకమైన షేర్వాణీలతో సభలో కాలుమోపారు. ఎంఐఎంకి చెందిన సభ్యుడు ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో తాము సభను బహిష్కరిస్తున్నట్టు బిజెపి సభ్యులు ప్రకటించిన విషయం విదితమే. మొత్తం మీద తొలి రోజు సభ ప్రమాణాలకే పరిమితమైనప్పటికీ...గతానుభవాలను గుర్తు చేస్తూ సరికొత్త దృశ్యాలను ఆవిష్కరించింది.

కెసిఆర్ ఆరోగ్యం మెరుగుపడుతోంది

- డాక్టర్ ప్రవీణ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. గాయం నుంచి క్రమంగా కోలుకుంటున్నారు. శస్త్రచికిత్స తర్వాత కెసిఆర్‌ను వైద్యులు శనివారం నడిపించారు. వారి సూచనల మేరకు వాకర్ సాయంతో బిఆర్‌ఎస్ అధినేత మెల్లగా అడుగులు వేశారు. ఇందుకు సంబంధించిన వీడియోని ఆ పార్టీ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. శస్త్రచికిత్స తర్వాత కెసిఆర్ ఆరోగ్యం మెరుగుపడిందని యశోద కన్సల్టెంట్ డాక్టర్ ప్రవీణ్ రావు తెలిపారు. త్వరితగతిన కోలుకునేందుకు అనుకూలంగా ఆయన శరీరం సహకరిస్తోందని చెప్పారు. మానసికంగా కూడా కెసిఆర్ దృఢంగా ఉన్నారని వెల్లడించారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి అవసరమన్నారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేసిన పేషెంట్లను వారి వారి శారీరక, మానసిక సామర్థ్యాన్ని పరిశీలించి వారిని "మొబిలైజేషన్ స్టార్ట్" చేస్తారని చెప్పారు. ఇందులో భాగంగా కెసిఆర్ బెడ్ బయటకు తీసుకొచ్చి కూర్చోబెట్టి వాకర్ సాయంతో నడిపించే ప్రయత్నం చేసినట్టు తెలిపారు.

" కెసిఆర్ గారి ఆరోగ్య పరిస్థితిలో ప్రోగ్రెస్ బాగుంది. చాలా వేగంగానే రికవరీ అవుతున్నారు. వాకర్‌తో బెడ్ బయటకు వచ్చి కూర్చున్నారు. వాకర్ సాయంతో మేము రూమ్‌లో నడిపించే ప్రయత్నం చేసినప్పుడు కేసిఆర్ శరీరం బాగా స్పందించింది. అక్కడ రూమ్ లో వాకర్ సాయం తో నడిచారు. దీన్ని మెడికల్ పరిభాషలో " మొబిలైజేషన్ స్టార్ట్" అంటారు. హిప్ రీప్లేసెమెంట్ జరగ్గానే పేషెంట్‌ను నడిపించే ప్రయత్నం చేస్తాం. వారు ఆపరేషన్ నొప్పి తగ్గి "మినిమం పెయిన్" తో కోలుకుంటున్నారు. బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు కూడా చేయిస్తున్నాం. మెడికల్‌గా స్టేబుల్‌గా ఉన్నారు. మరికొద్ది రోజుల పాటు ఫిజియో థెరఫీ కొనసాగించాల్సి వుంటుంది. ఇలానే శరీరం సహకరిస్తే మరో రెండు మూడు రోజుల్లో కెసిఆర్ డిశ్చార్జ్ చేస్తాము" అని డాక్టర్ ప్రవీణ్ రావు వెల్లడించారు.

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

లోపాలను సమీక్షించుకుంటాం

- ప్రజాసమస్యలకే సిపిఎం అధిక ప్రాధాన్యత
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వైపు నుండి జరిగిన లోపాలను సమీక్షించుకొని, జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మె ల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన సూర్యాపేట జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎం, ప్రజా సంఘాల నుండి రావాల్సిన ఓట్లను ఎన్నికలో రాబట్టలేక పోయామన్నారు. దీనిపై పార్టీ ఆత్మపరిశీలన చేసుకొని ముందుకు సాగుతా మన్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు సంబంధించిన వారు విచ్చలవిడిగా డబ్బు, మద్యం వంటి అనేక రకాలుగా ప్రలోభాలకు గురిచేసి ఓట్లను ఆకర్షించే విధంగా చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వారిపై చర్చించి పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పార్టీ నిర్మాణాన్ని చక్కదిద్దుకోవాలని సూచించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు అభినందనలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అన్నింటిని చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదని, ప్రజాసమస్యలకే అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఓడినా, గెలిచినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటంలో ముందువరుసలో ఉంటామన్నారు. పార్టీ జిలా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లులక్ష్మీ, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవులకు కడియం, పల్లా, కౌశిక్ రెడ్డి రాజీనామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీలుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వీరు వరుసగా జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. నిబంధనల ప్రకారం 15 రోజులలోపు ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయాలి. ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల కమిషన్ ఆరు మాసాలలోపు ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసి ఎమ్మెల్సీలుగా రాజీనామా చేస్తున్నట్లు లేఖలు అందజేశారు. వీరి రాజీనామాలను మండలి చైర్మన్ ఆమోదించారు. కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి 2021లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటాలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఖరారయ్యారు. వీరికి 2027 నవంబరు వరకు పదవీకాలం ఉంది. డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి 2015లో తెరాస తరపున నల్లగొండ, వరంగల్, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఇక 2021లోనూ ఇదే నియోజకవర్గం నుంచి రెండోసారి శాసనమండలి సభ్యుడిగా విజయం సాధించారు. రాజేశ్వర్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవీ కాలం 2027 వరకు ఉంది.

రేవంత్‌కు ఖాళీ 'గల్లా'

- తక్షణావసరాలకు నిధులు కరువు
- రైతుబంధుకు డబ్బుల్లేవు !?
- తలపట్టుకున్న ఆర్థికశాఖ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారును ప్రభుత్వ ఖజానా వెక్కిరిస్తు న్నది. గద్దెదిగిన బిఆర్‌ఎస్, కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఖాళీ గల్లాను అందించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.05 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా తాజాగా ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు పోటాపోటీగా మ్యానిఫెస్టోలు ప్రకటించాయి. హామీల మీద హామీలు గుప్పించాయి. అయితే అనూహ్యంగా అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థికపరమైన అంశాల్లో చుక్కలు కనిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా పోలింగ్‌కు ముందు ఎన్నికల కమిషన్ రైతుబంధును నిలిపేసిన సంగతి తెలిసిందే. ఫలితాల తర్వాత పదిరోజుల్లో రైతుబంధు నిధులను నేరుగా ఖాతాల్లో వేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రకటించారు. అయితే ప్రస్తుతం ఆర్థికశాఖ వ్యవహా రాలు ఏమాత్రం అందుకు అనుకూలంగా లేవనే వ్యాఖ్యానాలు వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం సర్కారీ ఖజానా ఖాళీ అయిందనే ప్రచారం సచివాలయంలో జరుగుతున్నది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండు విడతలుగా రైతుబంధు నిధులు విడుదలయ్యేవి. ప్రతి ఆరునెలలకు 70 లక్షల మంది రైతులకు రూ.7500 కోట్ల చొప్పున ఏడాదిలో రెండుసార్లు పెట్టుబడి సొమ్ము కింద రూ. 15,000 కోట్లు ప్రభుత్వం ఇచ్చేది. వానాకాలం, ఎండాకాలం సీజన్లల్లో రైతులకు ఆయా పంటల సాగు కోసం పెట్టుబడి కింద ఈ సొమ్మును అందజేసేవారు. అయితే గత కెసిఆర్ సర్కారు రైతులకు మాత్రమే ఈ సొమ్ము ఇచ్చింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులు, కౌలు రైతులు , రైతు కూలీలకు సైతం రైతుబంధును వర్తింపజేస్తామని ఎన్నికల ముందు హామీఇచ్చింది. అయితే కాంగ్రెస్ సర్కారు మాత్రం 10 నుంచి 15 ఎకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే రైతుబంధును వర్తింపజేసే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. స్లాబును తగ్గించడం ద్వారా ఏడాదికి అయ్యే ఖర్చులో నుంచి సుమారు రూ. 7000 కోట్లు మిగిలే అవకాశం ఉన్నట్టు అధికారులు అంటున్నారు. వీటిని ఇతర పథకాలను సర్దుబాటు చేయడానికి వీలుంటుందనే భావనలో వారున్నారు. అయితే దీనిపై అధికారికంగా ఇంకా కసరత్తు జరగాల్సి ఉంది. దీంతో పథకం అమలు ఆలస్యమయ్యే పరిస్థితులు ఉత్పన్నమవు తున్నాయి. తాజా మంత్రివర్గ విస్తరణ తర్వాత రైతుబంధుపై దృష్టిపెట్టే అవకాశముంది. మొత్తం ప్రక్రియ అంతా పూర్తిచేసి నిధులు విడుదలయ్యే నాటికి జనవరి రెండో వారం దాటనుందని తెలిసింది. నిధుల సమీకరణపై ఆర్థిక శాఖ అధికారులు చర్చోపచర్చలు చేస్తున్నారు.

అప్పు తీర్చలేదని దంపతుల దారుణ హత్య

- ముందు భర్తను హతమార్చి పాతిపెట్టిన వైనం
- విషయం బయటికి రాకుండాభార్యను సైతం హత్య
- ముంబాయి వ్యాపారుల ఘాతుకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పు తీర్చడం లేదని కక్షతో దంపతులను గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఫిలింనగర్‌లోని సత్యకాలనీ పయోనీర్ ఎన్‌క్లేవ్‌లో సయ్యద్ అహ్మద్ ఖాద్రీ(42), సయీదా మిరాజ్ ఫాతిమా(40) నివాసం ఉంటున్నారు. వీరికి 2014లో వివాహం అయింది. సయ్యద్ అహ్మద్ ఖాద్రీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మేకల వ్యాపారం కోసం ముంబయికి చెందిన వ్యాపారుల నుంచి రూ. 20 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే మూడేండ్లుగా వారికి అప్పు తిరిగి చెల్లించలేదు. దాంతో ఈ నెల రెండున ముంబయి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి టోలిచౌకీలో ఆశ్రయం పొందారు. 3వ తేదీన ఖాద్రిని కిడ్నాప్ చేసి ఓ చెరువు వద్ద హత్య చేసి అక్కడే పాతిపెట్టారు. ఫాతిమా ద్వారా ఈ విషయం బయటపడుతుందని భావించిన ముగ్గురు వ్యాపారులు మరుసటి రోజు ఆమె ఇంటికి వెళ్లి ఫాతిమాను ఉరివేసి చంపారు. ఎవరికి అనుమానం రాకుండా గ్యాస్ లీక్ చేసి బయటి నుంచి తాళం వేసి వెళ్లిపోయారు. నాలుగు రోజుల క్రితం ఫాతిమాకు తన సోదరి సైయెదా మెహర్ ఫాతిమా ఎన్ని సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దాంతో ఆమె నేరుగా ఇంటికి వచ్చి చూడగా ఇంటి నుంచి గ్యాస్ వాసన వచ్చింది. దాంతో ఆమె తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫాతిమా ఉరివేసుకుని కనిపించింది. పిల్లలు పుట్టకపోవడంతో ఫాతిమాను ఆమె భర్త ఖాద్రి చంపి పారిపోయాడని అనుమానించి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దంపతుల ఇంటి పరిసర ప్రాంతాల్లో, సిసి ఫుటేజీని పరిశీలించారు. ఇంటి లోపల నుంచి ముగ్గురు వ్యక్తులు బయటికి వస్తున్నట్టుగా కనిపించిన దృశ్యాలను పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత వారిని గుర్తించి శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అజ్గర్ షేక్ అలియాస్ అన్వర్ అన్ను, మహమ్మద్ హుస్సేన్ అలియాస్ సమీర్, మోహిత్ సల్మాన్ అలియాస్ అద్దులపై సెక్షన్ 302, 120 బి,379, అలాగే 498ఏ, 201 ఐపిసి ప్రకారం కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభ స్పీకర్ ఎన్నిక ఈ నెల 14న జరగనుంది. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఆధ్వర్యంలో ఆ ఎన్నిక జరగనుంది. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ నోటిఫికేషన్ ద్వారా సమయాన్ని నిర్ణయించాల్సి ఉన్నది. స్పీకర్ పదవికి ఇప్పటికే కాంగ్రెస్ పక్షం తరపున మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పేరును ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉన్నది. స్పీకర్ ఎన్నిక తర్వాత కొలువుదీరిన ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. దానిపై సభ్యులు చర్చిస్తారు. అనంతరం బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బిఎసి) సమావేశమై.. .సభను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించనుంది. శనివారం శాసనసభలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణం ముగిసిన తర్వాత శాసనసభ ఈ నెల14కు వాయిదా పడింది.

అమరులకు ఎమ్మెల్యేల నివాళులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు శనివారం ఉదయం బిజెపి, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అమరవీరులకు నివాళులర్పించారు. హైదరాబాద్‌లో అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కు వద్ద అమరవీరుల స్థూపానికి ముందుగా బిజెపి ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. ఆ పార్టీ నుంచి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలవగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తప్ప మిగిలిన ఎమ్మెల్యేలు అమరులను గుర్తు చేసుకున్నారు. బిఆర్‌ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, లాస్య నందిత సాయన్న తదితర ఎమ్మెల్యేలు అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వివేక్‌తో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామ్యేల్ తదితరులు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA.
O.S.5/2023

Between:
Sasumana Hemasundara Rao. --Plaintiff.
And:
Sasumana Yetheswara Rao And others. --Defendants.

NOTICE.

To,
D-1: Sasumana Yetheswara Rao, s/o Hemasundara Rao, Aged 23 years, M.Tech., Permanent resident of Pedda Veedhi, Garudhakhandi village & P.O., Palasa Mandal, Srikakulam Dist.

Please take notice that the plaintiff herein filed a suit for partition against you and it stands posted to **11-12-2023 at about 10:30 A.M.** in the above Court for your appearance, appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per law.

R. SRINIVASA RAO
K. RAJANIKANTH
K.S.PRASADBABU
ADVOCATES,
PALASA-SOMPETA.

G.R.CABLES LIMITED
CIN: L31300TG1992PLC013772
Regd. Office : #301, Madhava Apartments, Hill Colony, Khairatabad, Hyderabad - 500004.
ఎజిఎమ్ మరియు ఇ-ఓటింగ్ నోటీసు

కంపెనీ 32వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజిఎం) నవోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, నవోదయ కాలనీ, గుడిమల్కాపురం, మెహెందీపట్నం, హైదరాబాద్-500 028 వద్ద 30 డిసెంబర్, 2023 శనివారం చెప్పబడిన వార్షిక సాధారణ సమావేశం నోటీసులో పేర్కొన్న విధంగా వ్యాపారాలావాదేవీలు జరగడానికి నిర్వహించబడునని ఈ నోటీసు ద్వారా తెలియచేయటమైనది.

సర్క్యులర్లకు అనుగుణంగా, 08 డిసెంబర్, 2023 నాటికి కంపెనీ/డిపాజిటరీ పార్టిసిపెంట్(ల)తో రిజిస్టర్ అయిన ఇ-మెయిల్ ఐడిలు ఉన్న సభ్యులందరికీ 2022-23 వార్షిక నివేదిక ఎలక్ట్రానిక్ కాపీ పంపబడింది. కంపెనీ 32వ ఎజిఎమ్ వార్షిక నివేదికతో సహా వార్షిక నివేదిక స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ www.bseindia.com వద్ద అందుబాటులో ఉంది. ఇమెయిల్‌ల ద్వారా ఎజిఎమ్ నోటీసు పంపడం 08 డిసెంబర్, 2023న పూర్తయింది.

కంపెనీల చట్టం 2013 లోని సెక్షన్ 108, కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్ 2015లోని సవరించిన రూల్ 20, సెబి రెగ్యులేషన్స్ (ఎల్‌ఓడిఆర్) లోని 44వ రెగ్యులేషన్ మేరకు ఎజిఎంలో నిర్వహించే వ్యాపార కార్యకలపాలకు సంబంధించి సభ్యులందరికీ కంపెనీ ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఎజిఎమ్ తేదీన రిమోట్ ఇ-ఓటింగ్ అలాగే ఇ-ఓటింగ్ సిస్టమ్‌ని ఉపయోగించి సభ్యులు ఓటు వేసే సదుపాయాన్ని బిగ్‌షేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అందిస్తుంది.

కంపెనీల (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) సవరణ నియమాలు, 2015లోని రూల్ 20 ప్రకారం, రిమోట్-ఓటింగ్‌ని ఉపయోగించి ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఎజిఎమ్ తేదీన ఇ-ఓటింగ్ విధానంగా ఓటు వేయడానికి అర్హతను నిర్ణయించడానికి కంపెనీ 22 డిసెంబర్, 2023ని "కటాఫ్ తేదీ"గా నిర్ణయించింది. డిపాజిటరీల ద్వారా కటాఫ్ తేదీ అంటే 22 డిసెంబర్, 2023 నాటికి నిర్వహించబడే సభ్యుల రిజిస్టర్‌లో పేరు నమోదు చేయబడిన వ్యక్తి, ఎజిఎమ్‌లో రిమోట్-ఓటింగ్ లేదా ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని పొందేందుకు అర్హులు. సమావేశానికి ముందే రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా తమ ఓటు వేసిన సభ్యులు కూడా సమావేశానికి హాజరు కావచ్చు కానీ ఎజిఎమ్ వద్ద ఇ-ఓటింగ్‌లో మళ్లీ ఓటు వేయడానికి అర్హులు కాదు.

రిమోట్ ఇ-ఓటింగ్ వ్యవధి బుధవారం, 27 డిసెంబర్, 2023న ఉ.9.00 గం.లకు ప్రారంభమవుతుంది మరియు శుక్రవారం, 29 డిసెంబర్, 2023న సా.5.00 గం.లకు ముగుస్తుంది. ఈ కాలంలో కంపెనీ అర్హతగల వాటాదారులు, భౌతిక రూపంలో లేదా డీమెటీరియలైజ్డ్ రూపంలో షేర్లను కలిగి ఉంటే, ఎలక్ట్రానిక్ పద్ధతిలో తమ ఓటు వేయవచ్చు. ఆ తర్వాత ఓటింగ్ కొరకు బిగ్‌షేర్ ద్వారా ఇ-ఓటింగ్ మాడ్యూల్ నిలిపివేయబడుతుంది.

కంపెనీ ద్వారా ఎజిఎమ్ నోటీసు పంపిన తర్వాత షేర్లు పొందిన మరియు కంపెనీలో సభ్యులుగా మారిన వ్యక్తులు మరియు కట్-ఆఫ్ తేదీ అంటే 22 డిసెంబర్, 2023 నాటికి రిజిస్టర్‌లో పేర్లు కనిపించే వ్యక్తులు కూడా నోటీసును వీక్షించవచ్చు. 32%అనా+వీ% కింది లింక్‌లో: https://drive.google.com/file/d/1BwjCYDOvWivKYUVwpT0LSyty2LIN7Of-/view?usp=sharing అటువంటి సభ్యులు ఎజిఎమ్ నోటీసులో పేర్కొన్న విధానాన్ని అనుసరించడం ద్వారా రిమోట్-ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటింగ్‌కు సంబంధించిన ఏవైనా సందేహాలు / ఫిర్యాదుల విషయంలో, షేర్‌హోల్డర్లు తరచుగా అడిగే ప్రశ్నలు ("ఎఫ్‌ఎక్యూలు") మరియు https://ivote.bigshareonline.com వద్ద అందుబాటులో ఉన్న ఇ-ఓటింగ్ మాన్యువల్‌ను డౌన్‌లోడ్ సెక్షన్ క్రింద సూచించవచ్చు లేదా మీరు మాకు ఇ మెయిల్ ivote@bigshareonline.com లేదా కంపెనీ ఇ మెయిల్ grcablesltd@gmail.com వద్ద చేయవచ్చు.

ఇ-ఓటింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా పరిశీలించడానికి ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీ శ్రీమతి మంజుల ఆలేటిని స్క్రూటినైజర్‌గా నియమించారు.

కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 91 మరియు సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 42 మరియు 47 మరియు దాని క్రింద వర్తించే నిబంధనల ప్రకారం కూడా నోటీసు ఇవ్వబడింది. 32వ ఎజిఎమ్ ప్రయోజనం కొరకు కంపెనీ సభ్యుల రిజిస్టర్ మరియు షేర్ ట్రాన్స్‌ఫర్ పుస్తకాలు శనివారం 23 డిసెంబర్, 2022 నుండి శనివారం, 30 డిసెంబర్, 2023 వరకు (రెండు రోజులు కలుపుకొని) మూసివేయబడతాయి.

వారి ఇమెయిల్ చిరునామాలను నమోదు చేసుకోని సభ్యులు తమ ఇ మెయిల్ చిరునామాలను వారి సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్‌లతో నమోదు చేసుకోవాలని అభ్యర్థించారు మరియు ఫిజికల్ మోడ్‌లో మెంబర్ హోల్డింగ్ షేర్లు ఇ మెయిల్ grcablesltd@gmail.com ద్వారా ఫోలియో నంబర్, షేర్‌హోల్డర్ పేరు వంటి అవసరమైన వివరాలను అందించవచ్చు.

By Order of the Board of Directors
For G.R.Cables Limited
Sd/-
Nitin Kumar Mathur
Whole-time Director
DIN #06451862

Place: Hyderabad
Date : 08-12-2023

లెక్కకు లెక్క.. దెబ్బకు దెబ్బ..

- ఆర్థిక, విద్యుత్ శాఖలపై శ్వేతపత్రాలు సిఎం రేవంత్ విస్తృత కసరత్తు
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- అవినీతి అంతు తేల్చేదిశగా అడుగులు
- కాళేశ్వరంపైనా నిపుణులతో సమాలోచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ శాఖలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్తృత కసరత్తు చేస్తున్నారు. ఒకవైపు రాజకీయ వ్యవహారాలు చక్కబెడుతూనే, మరోవైపు సర్కారీ శాఖల పనులు సైతం కొలిక్కితెచ్చే పనిలోపడ్డారు. బిఆర్‌ఎస్ సర్కారు చేసిన తప్పిదాలు, అవినీతి అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. ఇందుకు కాంగ్రెస్ హైకమాండ్ సైతం రేవంత్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు టిపిసిసిలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. జారిపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సిఎం కెసిఆర్ ఆరోగ్యం గురించి ఒకవైపు ఆరా తీస్తూనే, మరోవైపు గత ప్రభుత్వ అవినీతిమకిలీపై కూపీలాగే పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకు తన అనుచరులు, వ్యవస్థలను వాడుకునే ప్రయత్నంలో ఉన్నారు.

సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే ఆర్థిక, విద్యుత్ శాఖలపై సిఎం సమీక్ష చేశారు. ఆర్థిక శాఖ ద్వారా 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన నిధుల కేటాయింపు, విద్యుత్ శాఖలోని రూ. 85 వేల కోట్ల అప్పులపై ప్రత్యేకంగా సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఇప్పటికే ఒకదఫా చర్చించారు. పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఇప్పటికే ఆ రెండు శాఖలను ఆదేశించారు. దీనిపై మలివిడత శాసనసభ సమావేశాల్లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఉన్నది ఉన్నట్టుగా వాస్తవ పరిస్థితి చెప్పే ప్రయత్నాల్లో ఉన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలి ఐదేండ్ల కాలంలో మాజీ సిఎం కెసిఆర్, ప్రాజెక్టులపై ఎమ్మెల్యేలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్టుగా, ఆర్థిక, విద్యుత్ శాఖలపై ఆ తరహా చర్యలకు పూనుకోవాలని అనుకుంటున్నట్టు తెలిసింది. అంతకంటే మునుపే శ్వేతపత్రాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజలు కట్టే పన్నులు, ఇతర మార్గాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలా వినియోగించిందనే విషయమై అవగాహన చేసుకునే పనిలో ఉన్నారు. విద్యుత్ కొనుగోలు విషయమై మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితిపై అధ్యయనం చేస్తున్నారు. ఉచిత విద్యుత్ విషయంలోనూ వివరాలు కావాలనీ, నివేదిక ఇవ్వాలని ఇప్పటికే విద్యుత్ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సునీల్‌శర్మను ఆదేశించారు. అయితే అప్పట్లో ఏం జరిగిందో పూర్తిస్థాయి పరిశీలన అనంతరమే చర్యలకు దిగాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఆషామాషీగా ముందుకెళ్లి ఆభాసుపాలయ్యే కంటే, ఆచితూచి అడుగులేస్తూ అవినీతిపరుల పీచమణిచే దిశగా సమాచారాన్ని సమకూర్చుకోవాలనే భావనలో సిఎం ఉన్నట్టు సమాచారం. ఆయా అంశాలపై న్యాయనిపుణులతో కూడా చర్చించే అవకాశాలు ఉన్నాయి. ప్రతిపక్షనాయకుడిగా ప్రజావ్యతిరేక విధానాలపై ఎలాంటి పోరాటం చేశారో, కేసులు వేశారో అదే స్ఫూర్తితో అధికారంలోకి వచ్చాక ప్రజాకోణం నుంచే పనిచేసేందుకు సంసిద్ధులైనట్టుగా సిఎం కనిపిస్తున్నారు. విద్యుత్ వ్యవహారంలో సమీక్ష సమావేశానికి ట్రాన్స్‌కో సిఎండి ప్రభాకర్‌రావు పిలిచినా రాలేదు. దీనిపై సమగ్ర వివరాలు తెలియాలంటే అవసరమైతే ఆయనపై కేసుపెట్టి, అరెస్ట్ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సచివాలయ వర్గాల్లో చర్చ చోటుచేసుకుంటున్నది. మాజీ సిఎం కెసిఆర్‌ను ఆసరాగా చూసుకుని, ప్రభాకర్‌రావు గతంలో ఆర్థిక శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారితో విభేదించి, ఆయన్ను టార్గెట్ చేశారనే ప్రచారమూ ఉంది. విద్యుత్ కొనుగోలు వ్యవహారం సాంతం అడ్డగోలుగా ఉందని అధికారులే అంటుండటం రేవంత్ సర్కారుకు ఊతమిచ్చినట్టవుతున్నది.

బిఆర్‌ఎస్ పతనానికి కాళేశ్వరం ప్రాజెక్టు కూడా ఒక కారణమని అందరికీ తెలిసిందే. ఎన్నికల ఫలితాల అనంతరం బిఆర్‌ఎస్ శ్రేణులు సైతం అంగీకరిస్తున్నాయి. దీనిపై కెసిఆర్ కుటుంబంలోనూ అంతర్గతంగా వాగ్వివాదం జరిగినట్టు సమాచారం. అయితే దీనిపై కూడా రేవంత్ ప్రభుత్వం ఆరా తీసున్నది. కేంద్ర ప్రభుత్వ ఆడిట్ సంస్థ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 1.26 లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. అయినా పనులు నాణ్యంగా జరగలేదు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల కుంగుబాటే ఇందుకు నిదర్శనం. దీంతో ఈ ప్రాజెక్టుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఏ) సైతం ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరగలేదని తేల్చింది. దీనిపై ఆయా రాజకీయ పార్టీలన్నీ బిఆర్‌ఎస్ సర్కారుపై విమర్శల దాడికి దిగాయి. దీనికోసం ఖర్చుపెట్టిన వ్యయంలో కనీసం 30 నుంచి 40 శాతం నిధులు అవినీతిబొక్కసాల్లోకి వెళ్లాయనే ఆరోపణలు విపరీతంగా వచ్చిన విషయం విదితమే. దీనిపై సిఎం గట్టిగానే ఆరా తీస్తున్నట్టు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రిపై ప్రతికారంతో కాకుండా విలువైన ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే కోణంలో పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇందుకు అధికారులను సైతం బాధ్యులను చేయాలని అనుకుంటున్నారు. అలాగే అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) వెంట ఉన్న అసైన్డ్ భూముల కేటాయింపులపై కూడా వివరాలు సేకరించే పనిలో రేవంత్ సర్కారు ఉందనే ప్రచారం ఇప్పటికే ఉంది.

'రైతుబంధు' ఎప్పుడు జమ చేస్తారు..?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అధికారంలోకి వచ్చాక డిసెంబర్ తొమ్మిదో తేదీన రైతు బంధు కింద రూ. 15 వేలు ఇస్తామని చెప్పారనీ, అవి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా ఎప్పటికీ తాము ప్రజల పక్షాన నిలబడుతామన్నారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యేలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రైతాంగమంతా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నదని తెలిపారు. 'వడ్లు అమ్ముకోకండి.. తాము బోనస్‌తో వడ్లు కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారంలో చెప్పారు. అధికారంలోకి వచ్చారు కదా రూ. 500 బోనస్‌తో వడ్లు ఎప్పుడు కొంటారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. మిచౌంగ్ తుపాను కారణంగా కొన్ని చోట్ల వడ్లు తడిశాయనీ, అలాంటి రైతులను ఆదుకోవాలని కోరారు.

మహిళా కార్పొరేటర్‌కి అవమానం

- రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభంలో ప్రోటోకాల్‌పై వివాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు కార్యక్రమాన్ని శనివారం ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కలెక్టర్ వి.పి గౌతమ్ ప్రారంభించారు. ఈ సమయంలో ఇక్కడ ప్రోటోకాల్ వివాదం చోటు చేసుకుంది. పథకం అమలు 54వ డివిజన్‌లో జరిగింది. ప్రోటోకాల్ నిబంధనలను అనుసరించి ఆ ప్రాంత డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల వేదికపైకి వచ్చి కలెక్టర్ పక్కన కూర్చున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాలతి వేదికపై కూర్చున్న మహిళా ప్రజాప్రతినిధి మంజులను మీరు కాస్త లేచి పక్కన కూర్చోవాలని చెప్పడంతో ఆమె అవమానానికి గురయ్యారు. ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమంలో తాను ఒక ప్రజాప్రతినిధిగా వేదికపై ఆసీనురాలినైతే తనను ప్రజల ముందే ఒక మహిళా అధికారి అక్కడి నుంచి పక్కకు జరగమని చెప్పడం సరికాదని ఆమె అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్య పథకం పేద ప్రజలకు ఒక వరం లాంటిదని అన్నారు. ఈ సందర్భంగా చేయూత పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

రాష్ట్రమంతా ఆరోగ్యశ్రీ

వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) , చేయూత (రాజీవ్ ఆరోగ్యశ్రీ) రెండు పథకాలను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వైద్య ఆరోగ్య, రవాణా శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పెంపును రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతీ హోళికేరి ప్రారంభించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఏరియాస్పత్రిలో కలెక్టర్ వెంకట్రావు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కోటాచలం, ఏరియాస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, డిఐఒ డాక్టర్ వెంకటరమణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

మాతృత్వపు మధురిమలు మరువలేనివి

- ఫెర్టి9 బేబీ మీట్‌లో నటి స్నేహ

ప్రజాశక్తి - హైదరాబాద్

మాతృత్వపు మధురిమలు మరువలేనివని ప్రముఖ సినీ నటి స్నేహ అన్నారు. సంతాన సాఫల్య చికిత్స ద్వారా పిల్లలు కన్న తల్లిదండ్రులతో శనివారం హైదరాబాద్‌లో బేబీ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నటి స్నేహ మాట్లాడుతూ సంతానం కోసం ఎదురుచూసే మహిళలకు ఫెర్టీ 9 విశిష్టమైన సేవలు అందిస్తోందని చెప్పారు. తమ సంస్థ నుండి మీకు కొన్ని ఉత్తేజకరమైన వార్తలను అందించడం ఆనందంగా ఉందనిఫెర్టీ 9 మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి జ్యోతి అన్నారు. సంతానోత్పత్తి, పునరుత్పత్తి ఆరోగ్యానికి అంకితమైన క్లినిక్‌గా, పేరెంట్‌హుడ్ వైపు ప్రయాణం ఆనందదాయకంగా, సవాలుగా ఉంటుందని అర్థం చేసుకున్నామన్నారు. సంతానోత్పత్తి కమ్యూనిటీని రక్షించడానికి, ప్రతి క్లినిక్ ల్యాబ్‌ల యొక్క అత్యంత నాణ్యతను కలిగి ఉండాలన్నారు. ఉత్తమ సేవలను అందించడానికి మాత్రమే పరిమితం కాకుండా మా రోగులు, మార్గదర్శకత్వం కోసం చూస్తున్న ప్రతి వ్యక్తి గురించి కూడా తాము చాలా శ్రద్ధ వహిస్తామన్నారు.

మా కుటుంబాలు రోడ్డున పడతాయి

- సిఎం రేవంత్ రెడ్డి తగిన పరిష్కారం చూపించాలి
- నెలకు రూ.15 వేల జీవనభృతి అందించాలని విజ్ఞప్తి
- ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మారయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంపై తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన నేపథ్యంలో తమకు జీవన భృతి కింద నెలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ఆటో డ్రైవర్లకు తగిన పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఆటో మోటార్స్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలన్నారు. ఆటో మీటర్ రేట్లు పెంచి కొత్త పర్మిట్ ఇవ్వాలని కోరారు. ఓలా, ఉబర్ సంస్థలను ప్రభుత్వం వారి ఆధీనంలోకి తీసుకొని నిర్వహించాలన్నారు.

1 నుంచి 8 సీట్లకు ఎదిగాం

- ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి ఒక్కరే ఎమ్మెల్యేగా గెలిచారనీ, ఇప్పుడా సంఖ్య ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు చేరిందని బిజెపి నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో 36 లక్షల ఓట్లు తెచ్చుకున్నామనీ, అధికారం దిశగా దూసుకెళ్తున్నామని చెప్పారు. బిజెపి గతంతో పోలిస్తే డబుల్ సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపిగా పోటీ చేసే విషయంలో పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బిజెపి, ఎంఐఎం కలిస్తే తమ బలం పెరుగుతుందని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యల్ని ఖండించారు.

వికలాంగులకు ఉచిత ప్రయాణ హామీ అమలు చేయాలి

- ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంపేరుతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, వికలాంగులకు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హర్షణీయం : ఆప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం పట్ల ఆప్ మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్ యమునా గౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో కలిసి వారు మాట్లాడారు. హేమ జిల్లోజు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ విజయానికి ఆప్ మేనిఫెస్టోనూ కాపీ కొట్టడమే కారణమని తెలిపారు. ఢిల్లీ, పంజాబ్‌లో ఉచిత విద్య, వైద్యం, నీరు, విద్యుత్తు, మహిళలకు ఉచిత రవాణా, నెలవారీ భత్యం గురించి ఆప్ చేసిన వాగ్దానాలు సక్రమంగా అమలు చేస్తున్నదని గుర్తుచేశారు. తమ పార్టీ మ్యానిఫెస్టోను కాపీ కొట్టినా సరే.... వాటిని సక్రమంగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఆప్ అధికార ప్రతినిధి అప్సహా, నేతలు మౌనిక, పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం

- ఎఫ్ఆర్‌ఓ వేధింపులతోనేనని బాధితురాలి ఆరోపణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వెంచపల్లి బీట్ ఆఫీసర్ లత ఆత్మహత్యాయత్నం చేశారు. శనివారం తెల్లవారుజామున అపస్మారక స్థితిలో ఉండగా భర్త హుటాహుటిన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. లత వెంచపల్లి బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన బీట్‌లో ప్లాంటేషన్‌లో ఒడిసా కూలీలు పని చేస్తున్నారు. వారికి డబ్బులు సరిగ్గా అందడం లేదంటూ ఎఫ్ఆర్‌ఒను సంప్రదించారు. దీనికి ఎఫ్ఆర్ఒ డబ్బులు లేవని, ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరింపు ధోరణితో మాట్లాడాడు. దీంతో కూలీలు డిఎఫ్ఒ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వెంటనే డిఎఫ్ఒ ఎఫ్ఆర్ఒకు ఫోన్ చేసి వివరాలు కోరారు. డబ్బులు సెక్షన్ ఆఫీసర్‌కి ఎప్పుడో ఇచ్చామని సమాధానం ఇచ్చాడు. తర్వాత ఎఫ్ఆర్‌ఓ లతను తన ఆఫీస్‌కు పిలిపించుకొని ఇష్టం వచ్చిన రీతిలో దుర్భాషలాడుతూ నీ వల్లనే నా పరువు పోయింది.. నువ్వు మెంటల్ హాస్పిటల్‌కు వెళ్లి జాయిన్ అవ్వాలి.. అంటూ గంట పాటు మానసికంగా వేధించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన లత రాత్రి 30 నిద్ర మాత్రలు మింగారు. తెల్లవారుజామున భర్త చూడగా అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎఫ్ఆర్ఒను వివరణ కోరగా తాను ఎఫ్‌బిఓను పిలిపించి మాట్లాడింది నిజమే కాని, వేధింపులకు గురిచేయలేదని అన్నారు. విధుల్లో భర్త జోక్యం ఎక్కువవుతోందని, తగ్గించాలని చెప్పానని అన్నారు.

కార్మికుల మనసు దోచిన రాజ్‌ఠాకూర్

- సింగరేణి కార్మికుని వేషధారణతో అసెంబ్లీకి
- భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి ప్రాంతం నుంచి వచ్చాడు. తొలిసారి గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాడు. తాను సింగరేణి కార్మికుల ప్రతినిధినంటూ కార్మికుల డ్రస్సు వేసుకుని, తట్ట, చెమ్మాస్ చేతిలో పట్టుకుని, లైట్‌తో కూడిన హెల్మెట్ పెట్టుకుని శాసనసభ ఆవరణలోకి శనివారం ఎంట్రీ ఇచ్చాడు. అందరి చూపూ తనవైపు తిప్పుకున్నాడు. అసెంబ్లీ ఆవరణలోకి రాగానే భావోద్వేగానికి లోనయ్యాడు. ఇంతకీ అతనెవరనుకుంటున్నారా? కాంగ్రెస్ నుంచి గెలుపొందిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్. ఆ వేషధారణతో అసెంబ్లీకి వచ్చి సింగరేణి కార్మికుల మనస్సు దోసేశాడు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. '25 ఏండ్ల నా సుదీర్ఘ పోరాటం ఫలించింది. సింగరేణి ప్రాంతం నుంచి కార్మికుల ప్రతినిధిగా అసెంబ్లీకి వచ్చా. వారి గౌరవం కాపాడుతా. గడీల పాలనకు చరమగీతం పాడి నాకు భారీ మెజార్టీ ఇచ్చిన సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలందరికీ ధన్యవాదాలు. సింగరేణి కార్మికులు అనేక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఓపెన్‌కాస్టులు ఇబ్బందికరంగా మారాయి. ఆ ప్రాంతమంతా కాలుష్యమై పోయింది. చుట్టూ నీళ్లున్నా కాలుష్యంతో తాగలేని పరిస్థితి ఉంది. అక్కడి వాతావరణంతో పెరాలసిస్, గుండెజబ్బులు, ఇతరత్ర అనారోగ్య సమస్యలతో ప్రజలు చనిపోతున్నారు. ఆ ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ పర్యావరణం పునరుద్ధ రించాలంటే వేల ఎకరాల్లో మొక్కలు నాటాలి. నేడు సింగరేణిలో కార్మికుల సంఖ్య ఏటేటా తగ్గిపోతున్నది. యువతకు మేలు చేయాలి. సింగరేణి ప్రాంతంలో చేయాల్సిన పను లెన్నో ఉన్నాయి. నాకు సాధ్యమైనంత మేరకు నియోజకవర్గ ప్రజలకు, సింగరేణి కార్మికులకు మేలు జరిగేలా సింగరేణి కార్మికుల ప్రతినిధిగా అసెంబ్లీలో మాట్లాడుతా' అంటూ భావోద్వేగంతో అన్నారు. అసెంబ్లీకి తన కుటుంబంతో కలిసి వచ్చారు.

ఎస్ఎల్‌బిసి కాల్వ పొడిగింపు కోసం కృషి
కె.జయవీర్‌రెడ్డి

ఎస్ఎల్‌బిసి కాలువను మరో తొమ్మిది కిలోమీటర్లు పొడిగించేందుకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ శాసనసభ్యుడు కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా అవకాశమిచ్చిన ఎఐసిసి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

సందర్శకుల గ్యాలరీకి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శనివారం అసెంబ్లీ సందర్శకుల గ్యాలరీకి వచ్చారు. సాధారణ ప్రజల తరహాలో వచ్చిన ఆయన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తిలకించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఆయన వెళ్లిపోయారు. అసెంబ్లీ సమావేశాల మొదటిరోజు సందడి వాతావరణం నెలకొంది. నూతన సభ్యుల ప్రమాణస్వీకారం ఉండడంతో వారి కుటుంబ సభ్యులు ఆ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చారు.

విఆర్‌ఎలుగానే కొనసాగించాలి

- వారసులకు ఉద్యోగాలివ్వాలి : జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిధ శాఖలకు బదిలీ చేసిన తమను తిరిగి విఆర్‌ఎలుగానే కొనసాగించాలని విఆర్‌ఎ జెఎసి నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 55 ఏండ్లు పైబడిన విఆర్‌ఎ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఐదు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద విఆర్‌ఎ జెఎసి సమావేశం జరిగింది. అందులో జెఎసి రాష్ట్ర నాయకులు వంగూరు రాములు, గోవింద్, రాజయ్య మాట్లాడారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం విఆర్‌ఎలను ఇరిగేషన్, మిషన్ భగీరథ, మున్సిపాలిటీ, పశుసంవర్ధక, తదితర శాఖలకు బదిలీ చేసిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 వేల మంది విఆర్‌ఎలున్నారనీ, వారిని ఇతర శాఖలకు పంపించడంతో అక్కడ పని చేయలేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఓ నం.81, 85 ప్రకారం రాష్ట్రంలోని విఆర్‌ఎలు చాలామంది ఇప్పటికే రిటైర్ అయ్యారనీ, మరికొంతమంది ఒకటి, రెండు నెలల్లో రిటైర్మెంట్ కాబోతున్నారని చెప్పారు. 81, 85 జిఓ ప్రకారం వారు నష్టపోయే ప్రమాదం ఉందని వాపోయారు. డిసెంబర్ 15న ప్రజాదర్బార్‌లో సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖామంత్రి, సిసిఎల్‌ఎ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. ప్రభుత్వం స్పందనను బట్టి తదుపరి కార్యాచరణ చేపడుతామన్నారు.

ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు

- ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలు పదేండ్లుగా ఉక్కిరి బిక్కిరయ్యారనీ, ఈ రోజు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డితో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించారన్నారు. ఒక్కరైనా కమ్యూనిస్టు నేత అసెంబ్లీలో ఉండాలనీ, ఉంటే పేద వర్గాలకు కొండంత అండ ఉంటుందని తనకు అవకాశమిచ్చారన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతానని తెలిపారు. పేద వర్గాల సమస్యలు ప్రభుత్వం ముందుంచే బాధ్యత తనపై ఉందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సహకారంతో గెలిచినప్పటికీ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తన బాధ్యతని చెప్పారు. ఉపా లాంటి చట్టాలు పోవాలని ఆకాంక్షించారు. ధరణిలో అనేక సమస్యలున్నాయనీ, వాటి పరిష్కారం కోసం కృషి జరగాలని అన్నారు.

'గని' గుర్తింపు ఎవరిదో..?

- 27న సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- బరిలో 13 సంఘాలు
- ఓటు వేయనున్న 39,748 మంది కార్మికులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ఈ నెల 27న జరగబోతున్నాయి. దీనికోసం కార్మికసంఘాలు సిద్ధమవుతున్నాయి. 13 సంఘాలు బరిలో నిలుస్తున్నాయి. సింగరేణి కార్మికుల హక్కుల సాధన, పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి కృషి, కార్మికులు, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యానికి మధ్య ఒక వారధిలా ఉండేందుకు ఒక యూనియన్‌ను కార్మికులు ఈ ఎన్నికల్లో ఎన్నుకొని ఆ సంఘానికి తగిన ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఆ సంఘమే కార్మికుల పక్షాన పోరాడేందుకు అన్ని విధాలుగా ముందుంటుంది. సింగరేణిలో కార్మికులకు ప్రాతినిధ్యం వహించే సంఘాన్ని ఎన్నకునేందుకు గత అక్టోబర్‌లో నోటిఫికేషన్ జారీ అయింది. అయితే నవంబర్30న అసెంబ్లీ ఎన్నికల ఉన్న నేపథ్యంలో సింగరేణి ఎన్నికలను అధికారులు డిసెంబర్27 వరకు వాయిదా వేశారు. ఇప్పటికే దీనికి సంబంధించిన నామినేషన్లు, ఓటర్ల జాబితా, గుర్తుల కేటాయింపు లాంటి ప్రక్రియలు ముగిసాయి. పోటీ చేస్తున్న గుర్తింపు సంఘాలు ప్రచారం చేపట్టాయి.

11 డివిజన్‌లు..

సింగరేణి బొగ్గు గనులు తెలంగాణలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉండగా వాటిని 11 డివిజన్‌లు(ఏరియాలు)గా ఏర్పాటు చేసి బొగ్గు ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. మొత్తం కార్మికులు 39,748 మంది సింగరేణి సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా కలిసి తమకు ప్రాతినిధ్యం వహించే సంఘాన్ని ఈ నెల 27న ఎన్నుకోనున్నారు.

గణనీయంగా తగ్గిన కార్మికుల సంఖ్య..

1998లో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు ప్రారంభం కాగా ఆ సమయంలో సింగరేణిలో కార్మికుల సంఖ్య లక్షా 20 వేలకుపైగా ఉండేది. 1998కి ముందు ఏ గుర్తింపు సంఘానికి ప్రాతినిధ్యం లేదు. చాలా మంది కార్మికులు రిటైర్ కావడం, కొత్త గనుల ఏర్పాటు లేకపోవడం, వారసత్వ ఉద్యోగాల కల్పన లేకపోవడం లాంటి అంశాలతో ప్రస్తుతం కార్మికుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఈ సంఖ్య 39,748కి దిగజారింది.

పోటీ చేసే సంఘాలు ఇవే.

గుర్తింపు సంఘం ఎన్నికల ప్రారంభానికి ముందు సింగరేణిలో పనిచేసే కార్మికులు వారి విభాగాలుగా యూనియన్లను ఏర్పాటు చేసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు ఎన్నికల ప్రారంభం తర్వాత రిజిస్టర్ సంఘాల పేరుతో కార్మికులకు ప్రాతినిధ్యం వహించేలా నిబంధనలు విధించారు. ఈ మేరకు ప్రస్తుతం 13 సంఘాలు కార్మికుల తరపున తమ పోరాటం కొనసాగిస్తున్నాయి.

గనులపై ప్రచార జోష్..

ఎన్నికలకు మరో 17 రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో కార్మిక సంఘాలన్నీ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశాయి. గనులు, కార్మికులు పని చేసే ఇతర స్థలాల్లో ప్రచారం చేస్తూ గుర్తింపు సంఘాన్ని ఎన్నుకోవాలని అభ్యర్థిస్తున్నారు. తమను ఎన్నుకుంటే సంస్థ నుంచి కల్పించాల్సిన హక్కులు, ఇతర సౌకర్యాల కోసం పోరాటం కొనసాగిస్తామని హామీలు గుప్పిస్తున్నారు.

ఇప్పడి వరకు గెలిచిన సంఘాలు..

సుమారు 25 ఏండ్లుగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరుగుతుండగా 3 సార్లు సిపిఐ అనుబంధ సంఘం ఎఐటియుసి, 2 సార్లు బిఆర్‌ఎస్ అనుబంధ సంఘం టిబిజికెఎస్, ఒకసారి కాంగ్రెస్ అనుబంధ సంఘం అయిన ఐఎన్‌టీయూసీ గెలుపొందాయి.

ఆలస్యంగా ఎన్నికలు..

బిఆర్‌ఎస్ పార్టీకి అనుబంధంగా ఉన్న టిబిజికెఎస్ గుర్తింపు సంఘం కాలపరిమితి 2021లోనే ముగిసినా కోవిడ్ కారణంగా ఎన్నికలు నిర్వహించలేదు. అనంతరం పలు కారణాల రీత్యా ఈ ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఎట్టకేలకు డిసెంబరు 27న ఈ ఎన్నికకు ముహూర్తం ఖరారు అయ్యింది. గతంలో మాదిరిగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుబంధమైన గుర్తింపు సంఘానికే కార్మికుల మద్దతు ఉంటుందని చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అధికారంలోకి రాగానే వచ్చిన ఈ ఎన్నికలపై ఆ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. మొన్నటి వరకు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ అనుబంధ సంఘమైన టిబిజికెఎస్ గుర్తింపు సంఘమైన టిబిజికెఎస్ తిరిగి తమ ఉనికిని కాపాడుకునేలా ఆ సంఘాల నాయకులు కృషి చేస్తున్నారు. మరో వైపు ఎఐటియుసి, ఐఎన్‌టియుసి సంఘాలు సింగరేణిలో తమ పట్టును నిలుపుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కార్మికులు ఎవరివైపు నిలుస్తారో 27న తేలనుంది.

పోటీ చేసే సంఘాలు - గుర్తులు

1) గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం –**చక్రంలో సుత్తి**
2) ప్రజా తెలంగాణ సింగరేణి కార్మిక సంఘం– **రెండు ఆకులు**
3) సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ – **కాగడ**
4)సింగరేణి కోల్‌మైన్స్ లేబర్‌యూనియన్–**టేబుల్ గడియారం**
5) సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ – **ఉదయిస్తున్న సూర్యుడు**
6) సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ – **మోటారు సైకిల్**
7) సింగరేణి గని కార్మిక సంఘం – **పిక్ యాక్స్**
8) సింగరేణి మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ – **తరాజు**
9) శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం – **సింహం**
10) తెంగాణ బొగ్గుగని కార్మిక సంఘం – **బాణం**
11) తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం - **పిడికిలిలో పాన**
12) సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ – **చుక్క**
13) తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం – **ల్యాంప్ హెల్మెట్**